


# 24 2 రోడ్ల కథ

"ఎక్కడ దిగాను? దిగననే అంటున్నాను గదా? ఆయనోడు దిగాక మళ్ళీ నేనెందుకూ?" అన్నాడు సుబ్బరాజు. "ఏవయ్యోయ్, ఈ కబుర్లన్నీ సభల్లో జెప్పు, నాయనమ్మల దగ్గరజెప్పు - రేపాయని క్యాన్వాసింగు జేస్తే! అంతేదప్ప ఇక్కడ గాదు. అసలదీగాక ఒకడు చేస్తాడని నువ్వు మానెయ్యడవేటంట. అలాటి జంకుండగూడదు పంతులారి కద్దెలీదు గావాల.

పంతులారి తాతగారు జమీందారంత ఆసామి, నవాబంత దర్జా, ఆయన రోడ్డు మీదికొస్తే మిగతోళ్లంతా పక్కకి నిలబడి జోహుకు మనాలిసిందే. పుల్లాటి మనిషి. మూడోతరం వచ్చేసరికి పులులు బలం చాలక ఎత్తులు మార్చాయి. వెనకటికో సింహం చూడు - ఓపిక చాలొచ్చాక గుహలో పడుకుని మూలుగుతూ దారే పొయ్యే మృగాల్ని కేకేసి మరీ తినేదిట.

చినపంతులు రాజ్యాని కొచ్చేనాటికి ఆర్థిక బలం తగ్గిపోయింది. అలా కాదనుకుంటే, కడంవాళ్ల సత్తా బాగా పెరిగిందనుకో. ఆయనగార్రోజిల్లా రాజకీయాల్దాకా ఎగురుతూ పడుతూ ఉండేవాడు. జరిగినన్నాళ్లూ జబర్దస్తీ మీద జరిగాక పన్లు నడిపించడానికి ఎత్తులు జిత్తులు వెయ్యక తప్పలేదు. గిట్టనోళ్ళు నక్కా గిక్కా అనేవోరు, కానివోడెవడు?

ఓ పాలాయనికి, జిల్లా అప్పారావుకీ లడాయి పడింది. జిల్లా అప్పారా వెపుడూ జిల్లా లెవెలు కెళ్ళలేదు. వెళ్ళాలని ఉబలాటపళ్లేదు. ఊహ కలిగితే పోడని కాదు. తిక్కమనిషి. తన కిందనున్న రాజ్యం మీద పట్టు గట్టిగా ఉంటే చాలని ఎవరో చెప్పారు. సరే నన్నాడు. ఉండుండి పెద్దెత్తుకెగరాలని మనసయిం దోనాడు. ఏం లేదు. ఎవరో ఒకాయన ఉత్తరా వ్రాసుకునే కాయితాల మీద తన పేరు అచ్చేయించుకుని ఓ బొత్తి బుక్కులా కట్టించాడు. అవి చూసి అప్పారావు ఓటి తయారుచేయించి పెట్టమన్నాడు. అవతలవాడు నవ్వి అదికా దప్పారావూ, నివ్వేమన్నా అయితేగాని ఇయ్యన్నీ ఎందుకూ? బియ్యే అనో ఎమ్మెల్యే అనో సెక్రటరీ అనో పేరు పక్కన వేయించుకోవాలి. అలాటి దేదేనా ఉంటేనే ఈ అచ్చులూ గట్రాను. దీన్నే లెట్రు హెడ్డంటారూ అన్నాడు.

బియ్యే అవడాని కీల్లేదుగదాని, "ఎమ్మెల్యే అవుతాను. పుస్తకాలచ్చేయించు" అన్నాడు అప్పారావు. అవు. అలాగే చేదారన్నాడు అవతలాయన.

అప్పారావు సాహసి. నాలుగెకరాల మనిషల్లా పదేళ్ళలో ముప్ఫయ్యెకరా ఆసామి అయ్యాడు. అప్పటికింకా పెళ్ళిగాలేదు. పెళ్ళంటే చిరాకు పడేవోడు. అయినా తల్లి చచ్చిపోయాక, నీళ్ళోసుకునేపుడు రోజూ వీపు దోమడానికీ అడ తోడుండాలని పెళ్ళాడిన మనిషి.

ఎలక్షన్ల కెక్కాలంటే ముందర కాసిని మంచిపన్లు జేసి ప్రజల్లో పేరు దెచ్చుకోవాలన్నారు మిత్రులు. లోగడ అశోకుడనే రాజు రోడ్లేయించి చెట్లు నాటించి బావులు తవ్వించెననీ, టూతౌంజండియర్సయినా పబ్లిసిటీ వేల్యూ తగ్గలేదనీ ఓ స్కూలు మేస్టర్రి చెప్పాడు. గాంధీగారు కూడా అలాగే చేశారుట అని అప్పారావు మేనల్లుడు చెప్పాడు.

అయ్యన్నీ మన వెక్కడ చేస్తావంది అప్పారావు భార్య.

నివ్వలాగుండేస్. మనవంటే మనం జేస్తావా. పంచాయితీ ఉంది. బ్లాకు డెవలప్మెంటుంది. జిల్లా బోర్డుంది – అళ్ళు చేస్తారు. మనం చెయ్యమని చెప్పాలి. అంతే అన్నాడు అప్పారావు.

ఎక్కువక్కర్లేదు. మనూర్నుంచి పెద్దూరు సంత బజారు దాకా రోడ్డేయిస్తే నాలుగూళ్ళ వోళ్ళకీ పనికొస్త దన్నాడు ఒక సలహాదారు. ఆ రోడ్డు మూడు మైళ్ళ తేలింది.

పైనించి శాంక్షన్లు అలీశమవుతాయని అప్పారావుకిందా మీదా పడి పంచాయతీ డబ్బుతో అరంభించాడు రోడ్డు.

అంతలో పంతులారూ ఎక్కణ్ణించో అందరూ బాదరా వచ్చారు అవతలొడ్డుకి. ఎలక్షను సీజను మంచి పన్ల స్కీము కింద రోడ్డు శాంక్షను చెయ్యమన్జెప్పి, ఆ లోపల కొంత తను పెట్టుబడి పెట్టి రోడ్డు అరంభించబొయ్యాడు. పెద్దూరు నుంచి పల్లెటి దిక్కులకేస్తే పబ్లిసిటీ ఎక్కువని తోచి ఆయనటేన్నించి అరంభించాడు – కొందరు నవ్వినా.

అప్పటికే రెండో సైడు నించి అప్పారావు మొదలెట్టించిన రోడ్డు పదిగజాల దాకా పడింది. పడిందని పంతులారి కెవరో చెప్పారు.

అలాగా ఏం రోడ్డు? పక్కారోడ్డా? కచ్చారోడ్డా? కాంక్రీటా? అన్నాడు పంతులారు కంగారుగా.

అళ్ళ మొకం! కాంక్రీ టెక్కడ దెస్తారు? కచ్చారోడ్డే అన్నాడు కబురుదెచ్చిన ఆసామి.

సరే అయితే మనం కాంక్రీటు పోయించేద్దారి. అనాక జూచుకోవచ్చు. అంతగా గవర్నమెంటోడివ్వనంటే పబ్లికెక్కౌంటు కమిటీవోడు తిడతాడంటే పన్నులు పెంచి వసూలు చేసేద్దారి అని సిమ్మెంటు కాంక్రీటు పోయించాడు పంతులుగారు పంతానికి.

చకచకా పన్లు సాగాయి. పోటాన పోటీగా సాగాయి.

ఓనాడు తెల్లారేసరికి దూరపుర్నించటొచ్చిన ఒకాయన పెద్దరోడ్డు మీంచి పాపిడ దీసినట్టు సూటిగా పోతున్న రెండు రోడ్లనీ జూసి కళ్ళు నులుపుకున్నాడు. మళ్ళీ రెండూ కనిపించాయి. బుర్ర తడువుకున్నాడు. రెండూ కనిపించాయి. దూరంగా పోలీసున్నూసి తువ్వాలుతో నోరు కప్పేసుకుని కిళ్ళీ బడ్డీ దగ్గరకెళ్ళి కిళ్ళీ

వేసుకున్నాడు. కాని తను తాగినట్టు గుర్తులేదు. మళ్లా వెళ్లి చూశాడు. రెండు రోడ్లు కనబడ్డాయి. తిన్నగా కళ్ళజోడు షాపుకెళ్ళి జోడు కొనుక్కున్నాడు. ఆ వరసన మూడు రోజులపాటు ఆ షాపులో కళ్ళజోళ్లు ముమ్మరంగా అమ్ముడుపోయాయి. చాలామంది - పోలీసుల్ని చూడగానే తాగకపోయినా తాగామని ఒప్పేసుకున్నారు. నాలుగోనాటికి కత విడిందీ. అంతా నాలిక్కరుచుకున్నారు, నిజంగా రెండు రోడ్లున్నాయని. ఆనాడు సాయంత్రం ఓ మినిస్టర్ ఓ రోడ్డుకి ప్రారంభోత్సవం చేశారు. గజం పక్కనే ఉన్న రెండో దాని కింకో గ్రూపు నాయకుడు రిబ్బను కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఒకటే పల్లెకి రెండు రోడ్లు - ప్రజల ఉత్సాహము దేశమభివృద్ధి అందరూ నేర్చుకోవలెను అని ఇద్దరూ ఉపన్యాసమిచ్చారు. పేపర్లలో పెద్ద హెడ్డింగులు పడ్డాయి. చూడబోయిన జనం నవ్వితే ఆనందంకొద్దీ అన్నారు. ఏడవగా ఆనంద బాష్పాలన్నారు.

వారం పదిరోజులకి మాత్రం ఎలక్షను ప్రచారం దగ్గర అసలు సంగతి అంతా చెప్పుకున్నారు. దండగ మాలిన పని అన్నారు. ఘోరం అన్నారు. ఆ దారి మీదే ప్రచారం చేశారు.

సుబ్బరాజూ, "ఆ ఇద్దరిలో సాహసి ఎవరు? ఎవరికి నువ్వు ఓటేస్తావు" అన్నాడు రెడ్డిగారు కథ ఆపి.

"ఏమీ లేకుండా పంచాయితీ డబ్బుతో రోడ్డారంభించిన అప్పారావు ఎక్కువ సాహసి. కాని నా ఓటు మాత్రం పంతులారికే. అవతలాడు ఓ పని చేస్తున్నాడని తెలిసిగూడా, ధైర్యంగా అదే పనిని మరింత ఖర్చుతో తను చేయించడం గొప్ప. అలాటోడివల్లే సర్కారువారు గొప్ప పనులు చేస్తారు" అన్నాడు సుబ్బరాజు.

రెడ్డిగారు మౌనం వహించారు.

"ఇంకొక్కటి, మీరు కత చెప్పి అడిగారని జవాబు చెప్పానే తప్ప, మీ కత బాగాలేదు, అందులో వింతేమీ లేదు" అన్నాడు సుబ్బరాజు కాస్సేపాగి.

"సర్సరి. అసలిది కత అయితేగా? కతగాదు గాబట్టే నిజంగా జరిగింది గాబట్టే ఇంత చప్పగా ఉంది. కత అయితే విడ్డూరాలకేం కొదవ" అన్నాడు రెడ్డిగారు పకపక నవ్వి.

★ ★ ★